రైతు భరోసా సాయం పెంచి ఇవ్వాలి

హుస్నాబాద్, జూన్ 30 : రైతు భరోసా కింద ఇస్తామన్న అదనపు ఆర్థిక సాయాన్ని వెంటనే అందించాలని పలువురు రైతులు కోరారు. హుస్నాబాద్ విశాల పరపతి సహకార సంఘం ప్రత్యేక మహాజన సభ ఆదివారం హుస్నాబాద్ పట్టణంలోని రైతు వేదిక లోసంఘం ఉపాధ్యక్షుడు ఎగ్గిడి అయిలయ్య అధ్యక్షతన జరిగింది. ఈ సందర్భంగా రైతు భరోసాపై రైతుల నుంచి అభిప్రాయ సేకరణ చేశారు. ఈ సందర్భంగా పలువురు రైతులు తమ అభిప్రాయాలను తెలిపారు. సమావేశంలో ఏడీఏ మహేశ్, రైతు సంఘాల నాయకులు మల్లికార్జున్‌రెడ్డి, వేణుగోపాల్‌రెడ్డి, రవీందర్‌గౌడ్, సంజీవరెడ్డి, మల్లేశం, సమ్మ య్య, మండల వ్యవసాయాధికారి నాగరాజురెడ్డి, రైతులు పాల్గొన్నారు.

రైతుబంధుపై అభిప్రాయ సేకరణ

కోహెడ, జూన్ 30 : మండల కేంద్రంలోని రైతు వేదికలో ప్యాక్స్ చైర్మన్ పేర్యాల దేవేందర్‌రావు రైతుభరోసా పథకంపై రైతుల నుంచి అభిప్రాయ సేకరణ తీసుకున్నారు. అభిప్రాయం సేకరించి జిల్లా అధికారులు, రాష్ట్ర ప్రభుత్వానికి పంపించారు. కార్యక్రమంలో డీఆర్ నాగేశ్వర్‌రావు, ఎవో భోగేశ్వర్, సీనియన్ ఇన్స్పెక్టర్ యాదగిరి, ఉపాధ్యక్షుడు బాలరాజు, పాలకవర్గ సభ్యులు సురేందర్‌రెడ్డి, దేవయ్య, సుగుణమ్మ, మణెమ్మ, తిరుపతి, బాలు, మనోహర్, కొండల్‌రెడ్డి, మల్లికార్జున్, సిబ్బంది, రైతులు పాల్గొన్నారు.

కోహెడ : రైతు వేదిక ముందు రైతులతో దేవేందర్‌రావు

సజావుగా ఆగమ పాఠశాల ప్రవేశ పరీక్ష

చేర్యాల, జూన్ 30 : కొమురవెల్లి మల్లికార్జున స్వామి వారి క్షేత్రంలోని వీరశైవ ఆగమ పాఠశాలలో ప్రవేశం పొందేందుకు కొమురవెల్లి మల్లన్న ఆలయ ఆధ్వర్యంలో ఆదివారం నిర్వహించిన ప్రవేశ పరీక్ష సజావుగా ముగిసింది. ఈ పాఠశాలలో మూడేండ్ల పాటు ఆగమ విద్యను నేర్చుకునేందుకు మొదటి సంవత్సరంలో ప్రవేశం పొందేందుకు నిర్వహించిన పరీక్షకు 24 మంది విద్యార్థులు హాజరయ్యారు. ఈ సందర్భంగా ఆలయ ఈవో బాలాజీశర్మ మాట్లాడుతూ.. ఈ పరీక్షలో ఉత్తీర్ణత సాధించిన విద్యార్థులకు ఆగమ పాఠశాలలో ప్రవేశం కల్పించడంతో పాటు మూడేండ్లు అన్ని వసతులు కల్పిస్తామన్నారు.

మల్లన్న ఆలయ అభివృద్ధికి అధిక నిధులు

చేర్యాల, జూన్ 30 : తెలంగాణ సంస్కృతి, సంప్రదాయాలకు ప్రతీకైన కొమురవెల్లి మల్లికార్జున స్వామి వారి ఆశీర్వాదంతోనే విజయం సాధించానని, మల్లన్న క్షేత్రాభివృద్ధికి అధిక నిధులు కేటాయిస్తానని భువనగిరి ఎంపీ చామల కిరణ్‌కుమార్‌రెడ్డి అన్నారు. ఆదివారం కొమురవెల్లి మల్లికార్జున స్వామిని ఎంపీ చామల జనగామ డీసీసీ అధ్యక్షుడు కొమ్మూరి ప్రతాప్‌రెడ్డితో కలిసి దర్శించుకుని ప్రత్యేక పూజలు చేశారు. ఈ సందర్భంగా ఆలయ గెస్ట్‌హౌజ్‌లో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఎంపీ మాట్లాడుతూ.. ఎంపీ నిధులను మల్ల న్న క్షేత్రాభివృద్ధికి కేటాయించి భక్తుల వసతుల కోసం కృషి చేస్తానని తెలిపారు. భువనగిరి నియోజకవర్గంలోని జనగామ, చేర్యాల మున్సిపాలిటీల అభివృద్ధికి నిధులు మం జూరు చేస్తానని అన్నారు. ఇందులో భాగంగా కేంద్ర పట్టణాభివృద్ధి శాఖ మంత్రికి సైతం ఇటీవల సీఎం రేవంత్‌రెడ్డి ఆధ్వర్యంలో ఎంపీలందరం కలిసి వినతిపత్రం ఇచ్చినట్లు తెలిపారు. కార్యక్రమాల్లో మద్దూరు జడ్పీటీసీ గిరి కొండల్‌రెడ్డి, యువజన నాయకుడు కొమ్ము రి రాకేశ్‌రెడ్డి, చేర్యాల, కొమురవెల్లి మండలాల అధ్యక్షులు కొమ్ము రవి, మహాదేవుని శ్రీనివాస్, మల్లన్న ఆలయ మాజీ చైర్మన్ పర్వాటకం లక్ష్మారెడ్డి, జిల్లా, మండల మహి ళ అధ్యక్షులు, నియోజకవర్గ నాయకులు, గ్రామశాఖల బాధ్యులు పాల్గొన్నారు.

సమావేశంలో మాట్లాడుతున్న ఎంపీ చామల

రెవెన్యూ డివిజన్ హామీపై దాటవేసిన ఎంపీ చామల

ఎంపీగాగెలిస్తే చేర్యాలను రెవెన్యూ డివిజన్‌గా, నియోజకవర్గ కేంద్రంగా ఏర్పాటు చేయిస్తానని ఎంపీ చామల నాడు హామీ ఇచ్చారు. ఈ విషయమై విలేకరుల ప్రస్తావించగా సరైన సమాధానం ఇవ్వకుండా అంశాన్ని దాటవేశారు.

రామకోటి సంస్థకు భక్తిరత్న జాతీయ పురస్కారం

గజ్వేల్, జూన్ 30 : తెలుగు వెలుగు జాతీయ స్వచ్ఛంద సేవా సంస్థ ఆధ్వర్యంలో కరీంనగర్‌లో ఆదివారం నిర్వహించిన కార్యక్రమంలో గజ్వేల్ పట్టణానికి చెందిన రామకోటి భక్త సమాజం వ్యవస్థాపక అధ్యక్షుడు రామరాజుకు భక్తిరత్న మహానంది జాతీయ పురస్కారంతో పాటు సన్మానపత్రాన్ని అధ్యక్షుడు పోలోజి రాజ్‌కుమార్, సదానందం తదితరులు అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. 25ఏండ్ల పాటు నిర్విరామ కృషి పట్టుదలతో రామకోటిని ఇంటింటికీ తిరిగి భక్తులచే రాయించామన్నారు. పురస్కారం రావడానికి తనవెన్నంటే ఉన్న భక్తులకు కృతజ్ఞతలు తెలిపారు.

రామరాజుకు భక్తిరత్న జాతీయపురస్కారం అందజేస్తున్న నిర్వాహకులు



విద్యార్థులకు సర్టిఫికెట్స్ ప్రదానం

కొండపాక (కుకునూరుపల్లి), జూన్ 30 : కొండపాక మండలంలోని దుద్దెడ ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో ఆదివారం బకినవా మార్షల్ ఆర్ట్స్ అధ్వర్యంలో గ్రేడింగ్ టెస్ట్ నిర్వహించారు. ఈ టెస్టులో 15 మంది విద్యార్థులు పాల్గొన్నారు. వీరికి బీఆర్ఎస్ నాయకురాలు మానస, బ్లాక్‌బెల్ట్ 5వ డాన్ మాస్టర్ నర్సింహులు, కోచ్ తిరుపతితో కలిసి బెల్ట్స్, సర్టిఫికెట్స్ ప్రదానం చేశారు. కార్యక్రమంలో టి.నాగరాణి, కె.వెంకట్‌గౌడ్ పాల్గొన్నారు.

కట్టమైసమ్మకు బోనాలు

కోహెడ జూన్ 30 : మండల కేంద్రంలోని ట్రాక్టర్స్ అసోసియేషన్ సభ్యులు ఆదివారం కట్టమైసమ్మకు ఆదివారం బోనం సమర్పించారు. ఈ సందర్భంగా ప్రత్యేక పూజలు చేశారు. ట్రాక్టర్స్ యూనియన్ సభ్యులు పాల్గొన్నారు.

పూర్తయిన అభివృద్ధి పనులను ప్రారంభించాలి

హుస్నాబాద్ మాజీ ఎమ్మెల్యే వొడితెల సతీశ్‌కుమార్

హుస్నాబాద్, జూన్ 30 : నియోజకవర్గంలోని ఏడు మండలాల్లో బీఆర్ఎస్ ప్రభుత్వ హయాంలో నిధులు మంజూరై పూర్తి చేసిన అభివృద్ధి పనులను వెంటనే ప్రారంభించాలని మాజీ ఎమ్మెల్యే వొడితెల సతీశ్‌కుమార్ అన్నారు. ఆదివారం ఆయన మీడియాతో మాట్లాడుతూ జూలై 4వ తేదీతో ఎంపీటీసీ, జడ్పీటీసీ సభ్యుల పదవీ కాలం పూర్తవుతున్నందున వారి హయాంలో జరిగిన పనులను ప్రారంభించాలని సూచించారు. రాష్ట్ర మంత్రి పొన్నం ప్రభాకర్ నియోజకవర్గంలో జరుగుతున్న అభివృద్ధి పనులు, పూర్తయిన పనులపై అధికారులతో కనీసం సమీక్ష నిర్వహించడం లేదని, లక్షలాది రూపాయలతో నిర్మించిన భవనాలు, రోడ్లు, కల్వర్టులు పూర్తయి నెలలు గడుస్తున్నా ప్రారంభించడంలో మంత్రి నిర్లక్ష్యం చేస్తున్నారని ఆరోపించారు. ఇప్పటికైనా మంత్రి పొ న్నం ప్రభాకర్ అధికారులతో సమీక్ష నిర్వహించి నియోజకవర్గంలోని ఏడు మండలాల్లో పూర్తయిన పనులను గుర్తించి వెంటనే ప్రారంభోత్సవాలు చేయాలని ఆయన డి మాండ్ చేశారు. లేకుంటే ఐదేండ్లు ప్రజా సేవ చేసిన ఎంపీటీసీ, జడ్పీటీసీ సభ్యులను అవమానపర్చినట్లేనని అన్నారు.

భారత్ గెలుపు పట్ల యువత సంబురాలు

కోహెడ, జూన్ 30 : టీ 20 క్రికెట్‌లో భార త్ ప్రపంచ కప్ సాధించిన సందర్భంగా ఆదివారం సంకల్ప స్వచ్ఛంద సంస్థ అధ్యక్షుడు ఆదివారం క్రికెట్ క్రీడా అభిమానులకు స్వీట్లు పంచిపెట్టారు. యువకులు శనివారం రాత్రి అంబేద్కర్ చౌరస్తాలో టపాసులు కాల్చి సం బురాలు చేసుకున్నారు. కార్యక్రమాల్లో అనుమండ్ల రవీందర్‌రెడ్డి, చంద్ర య్య, జానయ్య, రమేశ్, రాజయ్య, రాజు, సమ్మయ్య, జాకీర్, సంపత్, కిరణ్, చందు పాల్గొన్నారు.

ఆర్యవైశ్య సంఘం పట్టణ అధ్యక్షుడిగా శ్రీనివాస్

చేర్యాల, జూన్ 30 : పట్టణంలోని వైశ్య భవనంలో ఆదివారం ఆర్యవైశ్య సంఘం ఎన్నిక నిర్వహించారు. ఈ సందర్భంగా సంఘం పట్టణ అధ్యక్షుడిగా శ్రీనివాస్‌ను ఎన్నుకున్నారు. అనంతరం మాజీ ఎమ్మెల్యే కొమ్మూరి ప్రతాప్‌రెడ్డిని నూతన అధ్యక్షుడిగా ఎన్నికైన శ్రీనివాస్ మర్యాద పూర్వకంగా కలిశారు. కార్యక్రమంలో కాంగ్రెస్ పట్టణ అధ్యక్షుడు మంచాల చిరంజీవులు, వైశ్య సంఘం నాయకులు పాల్గొన్నారు.

రేపు ఇసుక డంపులకు వేలం

నంగునూర్, జూన్ 30 : మండల కేంద్రంలో ఇటీవల పోలీసులు స్వాధీనం చేసుకున్న 98 ట్రాక్టర్ ట్రిప్పుల ఇసుక డంపులకు ఈ నెల 2న ఉదయం 11గంటలకు వేలం పాట నిర్వహించనున్నట్లు తహసీల్దార్ సరిత ఒక ప్రకటనలో తెలిపారు. ఇసుక అవసరం ఉన్న వారు వేలంలో పాల్గొనాలని తెలిపారు.

మహనీయుల జీవితచరిత్రను పాఠ్యపుస్తకాల్లో చేర్చాలి

గజ్వేల్, జూన్ 30: మహాత్మా జ్యోతిరావు పూలే, బాబాసాహెబ్ అంబేద్కర్ జీవిత చరిత్రను ప్రభుత్వ పాఠ్యపుస్తకాల్లో ప్రచురించాలని గజ్వేల్ అంబేద్కర్ సంఘం అధ్యక్షుడు అటకురి రాములు, ప్రధాన కార్యదర్శి మస్కూరి కిష్టయ్య కోరారు. ఆదివారం గజ్వేల్‌లో అంబేద్కర్ విగ్రహానికి జ్ఞానమాల వేసిన సందర్భంగా వారు మాట్లాడుతూ.. పేదవారికి చదువు, ప్రతి పౌరుడికి సమాన హక్కులు పనికి సరిపడా సమాన వేతనం అందుతుందంటే అంబేద్కర్ తీసుకొచ్చిన హక్కులే కారణమన్నారు. కార్యక్రమంలో మన్నె కృష్ణ, బొల్లారం ఎల్లయ్య, పంబాల సత్యనారాయణ, ఎన్.సత్యనారాయణ, నాగయ్య, బాలయ్యలు పాల్గొన్నారు.

అంబేద్కర్ విగ్రహానికి జ్ఞానమాల వేస్తున్న నాయకులు

సరస్వతీ మాత ఆలయంలో ప్రత్యేక పూజలు

వర్గల్, జూన్ 30 : వర్గల్ విద్యాధరిణి శ్రీసరస్వతీమాత ఆలయంలో ఆదివారం ఉమ్మడి జిల్లా డీసీసీబీ చైర్మన్ చిట్టి దేవేందర్‌రెడ్డి కుటుంబసభ్యులతో కలిసి అమ్మవారిని దర్శించుకుని ప్రత్యేక పూజలు చేశారు. అనంతరం ఆయన విలేకరులతో మాట్లాడుతూ.. ప్రభుత్వం రైతుల కోసం ఏకకాలంలో రూ.2 లక్షల రుణమాఫీకోసం కసరత్తు ప్రారంభించిందని,ఒకటి రెండురోజుల్లో విధివిధానాలు వెల్లడించినట్లు తెలిపారు.

సరస్వతీమాతను దర్శించుకుంటున్న డీసీసీబీ చైర్మన్ కుటుంబసభ్యులు

దండోరా రజతోత్సవాల కరపత్రం ఆవిష్కరణ

సిద్దిపేట టౌన్, జూన్ 30 : హైదరాబాద్ రవీంద్రభారతిలో జూలై 7న జరిగే దండోరా రజతోత్సవాల కరపత్రాన్ని ఎమ్మార్పీస్ టీఎస్ జాతీయ వర్కింగ్ ప్రెసిడెంట్ గుర్రాల శ్రీనివాస్ ఆవిష్కరించారు. ఈ సదస్సుకు అందరూ తరలిరావాలని ఆయన కోరారు. కార్యక్రమంలో లింగాల కృష్ణ, స్వామి, ఎల్ల య్య,యాదగిరి,చందు,రామన్న తదితరులు పాల్గొన్నారు.

పురస్కారం అందుకున్న రాజేశ్వర్‌రెడ్డి

సిద్దిపేట టౌన్, జూన్ 30 : సిద్దిపేటకు చెందిన ప్రముఖ జ్యోతిష్యుడు డాక్టర్ కలకుంట్ల రాజేశ్వర్‌రెడ్డికి అరుదైన పురస్కారం లభించింది. తమిళనాడు విల్లిపురంలో ఆదివారం జాతీయ హిందూ ఆలయాల పరిరక్షణ, ఆధ్యాత్మిక జ్యోతిష్య సంస్థ వారు మొదటి సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా జ్యోతిష్య రంగంలో రాజేశ్వర్‌రెడ్డి చేసిన సేవలకు జ్యోతిష్యభూషణ బిరుదుతో ఘనంగా సత్కరించారు. పురస్కారం అందుకున్న రాజేఏశ్వర్‌రెడ్డిని పలువురు అభినందించారు.

సమస్యలు పరిష్కరించాలని ఆందోళన

చేర్యాల, జూన్ 30 : పట్టణంలోని తెలంగాణ సాంఘిక సంక్షేమ బాలికల రెసిడెన్షియల్ పాఠశాల (కళాశాల) విద్యార్థులకు వసతులు లేకపోవడంతో తల్లిదండ్రులు ఆదివారం కళాశాల ఎదుట ఆందోళన చేపట్టారు. తాగునీటి సమస్యతో పాటు విద్యార్థులకు సమయానికి భోజనం పెట్టడం లేదని, పారిశుధ్య నిర్వహణ సక్రమంగా లేదని తెలిపారు. ఈ సమస్యలను వెంటనే పరిష్కరించాలని వారు డిమాండ్ చేశారు.

గుర్తు తెలియని వ్యక్తి మృతదేహం లభ్యం

సిద్దిపేట అర్బన్/కొండపాక, జూన్ 30 : గుర్తు తెలియని మృతదేహం లభ్యమైన ఘటన సిద్దిపేట త్రీ టౌన్ పోలీస్ స్టేషన్ పరిధిలోని దుద్దెడ గ్రామ శివారులో ఆదివారం జరిగింది. త్రీటౌన్ సీఐ విద్యాసాగర్ తెలిపిన వివరాలు.. దుద్దెడ గ్రామ శివారులో హరిత హోటల్ సమీపంలో మిద్దె పోచయ్య వ్యవసాయ పొలం వద్ద సిద్దిపేట-హైదరాబాద్ రాజీవ్ రహదారిపై గుర్తు తెలియని వ్యక్తి మృతి చెంది ఉన్నాడు. మృతదేహం గుర్తు పట్టని విధంగా ఉంది. వయస్సు 45 నుంచి 48 ఉంటుంది. మృతదేహాన్ని సిద్దిపేట ప్రభుత్వ దవాఖానకు తరలించాం. కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నామని తెలిపారు.



ఇచ్చిన హామీలను అమలు చేయాలి

కొమురవెల్లి, జూన్ 30 : కేంద్రలోని బీజేపీ ప్రభుత్వం, రాష్ట్రంలోని కాంగ్రెస్ ప్రభుత్వం ఎన్నికల సమయంలో ఇచ్చిన హామీలను అమలు చేయాలని సీపీఎం రాష్ట్ర కార్యవర్గసభ్యుడు ఎండీ.అబ్బాస్ అన్నాడు. ఆదివారం కొమురవెల్లి మండల కేంద్రంలో రెండు రోజుల సీపీఎం రాజకీయ శిక్షణ తరగతులకు ముఖ్య అతిథిగా ఆయన హాజరయ్యారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ.. ఇచ్చిన హామీలను వెంటనే అమలు చేయలేని పక్షంలో సీపీఎం ఆధ్వర్యంలో పెద్ద ఎత్తున ప్రజా ఉద్యమాలు నిర్మిస్తామని తెలిపారు. కార్యక్రమంలో సీపీఎం జిల్లా కార్యదర్శి మల్లారెడ్డి, నాయకులు శశిధర్, గోపాలస్వామి, సత్తిరెడ్డి, ఎల్లయ్య, భాస్కర్, వెంకట్, యాదగిరి, రవికుమార్, కృష్ణారెడ్డి, శారద, రవీందర్ తదితరులు పాల్గొన్నారు.

మాట్లాడుతున్న ఎండీ అబ్బాస్

డిపో అభివృద్ధిలో భాగస్వాములు కావాలి

హుస్నాబాద్, జూన్ 30 : హుస్నాబాద్ డిపో అభివృద్ధిలో ఉద్యోగులు, కార్మికులు భాగస్వాములు కావాలని డిపో మేనేజర్ డీసీహెచ్ వెంకటేశ్వర్లు అన్నారు. ఆదివారం డిపో ఆవరణలో జరిగిన కార్యక్రమంలో ఆదర్శ ఉద్యోగుల అభినందన సభ జరిగింది. ఈ సందర్భంగా మే-2024నెలలో ఉత్తమ ప్రతిభ కనబర్చిన ఉద్యోగులకు ప్రగతి చక్ర అవార్డులను అందజేశారు. ఉద్యోగుల పిల్లలకు నిర్వహించిన వ్యాసరచన పోటీలు, నృత్యపోటీల్లో గెలిచిన వారికి బహుమతులు పంపిణీ చేశారు. కార్యక్రమంలో డిపో సూపరిండెంట్ శ్రీధర్, ట్రాఫిక్ సూపర్‌వైజర్ సమ్మయ్య, ఉద్యోగులు పాల్గొన్నారు.

అవార్డులు పొందిన ఆదర్శ ఉద్యోగులతో డిపో మేనేజర్ వెంకటేశ్వర్లు

పారిశుధ్య కార్మికుడికి జాతీయ పురస్కారం

హుస్నాబాద్‌రూరల్, జూన్ 30 : మండలంలోని పొట్లపల్లికి చెందిన బోనగిరి లక్ష్మణ్ తెలుగు వెలుగు సాహితీ వేదిక జాతీయ పురస్కారాన్ని అందుకున్నాడు. ఆదివారం కరీంనగర్‌లోని ఫిలింభవన్‌లో నిర్వహించిన తెలుగు వెలుగు జాతీయ పురస్కారాల అవార్డుల ప్రధానోత్సవంలో భాగంగా కార్మిక రంగంలో లక్ష్మణ్ గ్రామానికి చేస్తున్న సేవలను గుర్తించి కార్మిక రత్న జాతీయ అవార్డును సంస్థ అందించింది. ఈ సందర్భంగా మాజీ సర్పంచ్ సుశీల, వైస్ ఎంపీపీ నిర్మల, మోహన్, గ్రామస్తులు సంతోషం వ్యక్తం చేశారు.

కార్మికరత్న జాతీయ పురస్కారం అందుకుంటున్న లక్ష్మణ్

ఆత్మలు శాంతించాలంటే..అప్పు చెల్లించండి !

- మృతిచెందిన దంపతుల పేరిట ఫ్లెక్సీలు
- ధూళిమిట్టలో హృదయ విదారకరమైన సంఘటన

మద్దూరు (ధూళిమిట్ట), జూన్ 30: గ్రామస్తులు, బంధుమిత్రులకు మేము తెలియజేయునది ఏమనగా.. మా ద్వారా కిరాణా షాపులో సరుకులు ఉద్దెర తీసుకున్న వారికి, చేతిబదులుగా డబ్బులు తీసుకున్న వారికి మా విన్నపం. దయచేసి మీరు తీసుకున్న ప్రతి రూపాయిని మా పిల్లలకు అందజేసి మా ఆత్మలకు శాంతి చేకూర్చాలని కోరుకుంటున్నామని మృతి చెందిన దంపతుల పేరిట వెలిసిన ఫ్లెక్సీలు ప్రతి ఒక్కరిని కంటతడి పెట్టిస్తున్నాయి. పూర్తి వివరాలలోకి వెళ్లితే ధూళిమిట్ట మండల కేంద్రానికి చెందిన తాడూరి కరుణాకర్, దివ్య దంపతులు వ్యవసాయంతో పాటు ఇంటిముందు చిన్న కిరాణా షాపు పెట్టుకొని జీవనం సాగిస్తున్నారు. వీరికి శివ, శశి అనే ఇద్దరు కుమారులు ఉన్నారు. ఎంతో అన్యోన్యంగా సాగిపోతున్న వీరి జీవితంలో విషాదం నెలకొంది. నాలుగేండ్ల క్రితం వ్యవసాయ బావి వద్ద ప్రమాదవశత్తు కరెంట్ షాక్ తగిలి కరుణాకర్ మృతి చెందాడు. భర్త మృతితో దివ్య కుంగిపోకుండా తమకు జీవనాధారమైన కిరణాషాపును నడుపుకుంటూ తన ఇద్దరు కుమారులను పోషించుకుంటుంది. కిరాణా షాపుకు వచ్చిన వారిని కాదనకుండా దివ్య ఉద్దెరకు కూడా సరుకులు ఇచ్చేది. కొంతమందికి చేతి బదులుగా డబ్బు కూడా సహాయం చేసేది. ఈ క్రమంలో దివ్య అనారోగ్యంతో గత నెల రోజుల క్రితం మృతి చెందింది. తల్లి మృతితో పిల్లలు అనాథలయ్యారు. తల్లిదండ్రులు మృతి చెందిన పిల్లలు ప్రస్తుతం నానమ్మ-తాతయ్య భారతమ్మ-నర్సయ్య, బాబాయి స్వామిల సంరక్షణలో ఉంటున్నారు. అయితే తమ అన్న-వదినలు బతికుండగా ఎంతో మందికి కిరాణా షాపులో ఉద్దెరకు సరుకులు ఇవ్వడంతో పాటు కొంతమందికి చేతిబదులుగా డబ్బులు అప్పుగా ఇచ్చారని వాటిని తిరిగిస్తే పిల్లల అవసరాలకు అక్కరకు వస్తాయని చెప్పి కరుణాకర్ గ్రామంలో పలు చోట్ల ఫ్లెక్సీలను ఏర్పాటు చేసి, వాటిపై తన 'గూగుల్ పే' నంబర్‌ను కూడా ఇచ్చారు.

కిరాణా షాపు ఎదుట వేసిన ఫ్లెక్సీ వద్ద దివ్య-కరుణాకర్‌ల పిల్లలు

పూర్వవిద్యార్థుల సమ్మేళనం

సమ్మేళనంలో పాల్గొన్న పూర్వ విద్యార్థులు

మద్దూరు (ధూళిమిట్ట), జూన్ 30: మండల పరిధిలోని సలాఖపూర్ జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో 1989-90 బ్యాచ్‌కు చెందిన పదో తరగతి విద్యార్థులు ఆదివారం తాజ్‌మహల్ గార్డెన్‌లో పూర్వ విద్యార్థుల సమ్మేళనం ఏర్పాటు చేశారు. 35 ఏండ్ల తర్వాత వారంతా ఒక్కచోట కలిసి చిన్ననాటి జ్ఞాపకాలను నెమరువేసుకున్నారు. విద్యా బుద్ధులు నేర్పిన గురువులను సన్మానించారు. అనంతరం పూర్వ విద్యార్థులు ఆట, పాటలతో సందడి చేశారు.

చేర్యాలలో..

చేర్యాల, జూన్ 30 : మండలంలోని నాగపురి జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో 2003-04లో 10వ తరగతి అభ్యసించిన విద్యార్థులు ఆదివారం గ్రామ పాఠశాలలో పూర్వ విద్యార్థుల ఆత్మీయ సమ్మేళనం నిర్వహించారు. ఈ సందర్భంగా విద్యాబుద్ధులు నేర్పిన నాటి ఉపాధ్యాయులను సన్మానించడంతో పాటు పాఠశాల అభివృద్ధికి రూ.25 వేల విరాళం అందజేశారు.

నాగపురిలో అపూర్వ సమ్మేళనం

ప్రతి ఉద్యోగి అంకితభావంతో ఉండాలి

గజ్వేల్, జూన్ 30 : ప్రభుత్వ ఉద్యోగి విధి నిర్వహణలో అంకితభావంతో పనిచేసినప్పుడే లక్ష్యానికి చేరుకుంటామని సీఐ సైదా అన్నారు. ఆదివారం గజ్వేల్‌ప్రజ్ఞాపూర్ ఆర్టీసీ డిపోలో లక్షే లక్ష్యం ఛాలెంజ్‌లో భాగంగా ఎక్కువ నగదు, ఆదాయం తీసుకొచ్చిన డ్రైవర్లు, కండక్టర్లలతో పాటు వ్యాస రచన పోటీల్లో పాల్గొన్న ఆర్టీసీ ఉద్యోగుల పిల్లలకు బహుమతులు ప్రదానం చేశారు. కార్యక్రమంలో డీఎం సురేఖ, సిబ్బంది పాల్గొన్నారు.

లయన్స్ క్లబ్ ఆఫ్ స్నేహ అధ్యక్షుడిగా మల్లేశంగౌడ్

గజ్వేల్, జూన్ 30: గజ్వేల్ లయన్స్ క్లబ్ ఆఫ్ స్నేహ అధ్యక్షుడిగా గజ్వేల్‌కు చెందిన మల్లేశంగౌడ్‌ను ఆదివారం ఏకగ్రీవంగా ఎనుకున్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. తన మీద నమ్మకంతో పదవిని అప్పగించిన వారికి, సహకరించిన వారికి కృతజ్ఞతలు తెలిపారు. నిరుపేదలకు అండగా నిల్చుని సేవా కార్యక్రమాలు చేస్తానన్నారు.

మృతురాలి కుటుంబానికి ఆర్థిక సహాయం

దుబ్బాక, జూన్ 30 : దుబ్బాక పోలీసు స్టేషన్‌లో స్వీపర్‌గా పని చేస్తున్న ఎండీ మౌలానాబీ (100) అనారోగ్యంతో శనివారం రాత్రి మృతి చెందింది. మండల పరిధిలోని హబ్షీపూర్‌కు చెందిన మౌలానా 60 ఏండ్లుగా దుబ్బాక పోలీసు స్టేషన్‌లో స్వీపర్‌గా పని చేసింది. ఆమె మృతి పట్ల దుబ్బాక పోలీసులు సంతాపం వ్యక్తం చేశారు. సీపీ అనురాధ ఆదేశాల మేరకు అంత్యక్రియల కోసం ఆదివారం మృతురాలి కుటుంబీకులకు రూ. 20 వేలు అందజేసినట్లు దుబ్బాక సీఐ శ్రీనివాస్ తెలిపారు.

ఆపన్నహస్త మిత్రబృందం చేయూత

గజ్వేల్, జూన్ 30 : అనారోగ్యంతో బాధపడుతూ ప్రస్తుతం ఉస్మానియా దవాఖానలో చికిత్సపొందుతున్న మండల పరిధిలోని దిలాల్‌పూర్ గ్రామానికి చెందిన ఫకీర్‌బాబాకు ఆపన్నహస్త మిత్రబృందం ఆధ్వర్యంలో ఆదివారం 91వ కార్యక్రమంలో భాగంగా ఆర్థికసాయం అందజేశారు. ఉండేందుకు ఇల్లు లేని ఫకీర్ కుటుంబ సభ్యులకు రూ.20వేల ఆర్థికసాయం అందజేసి చేయూతనిచ్చారు. కార్యక్రమంలో అధ్యక్షుడు బాల్‌చంద్రం సభ్యులు పాల్గొన్నారు.

శేష జీవితంలో సమాజ సేవ చేయాలి

మిరుదొడ్డి, జూన్ 30 : ఉద్యోగులు ఉద్యోగ విరమణ తర్వాత సమాజ సేవ చేయాలని ఎంపీపీ గజ్జల సాయిలు, ఎంపీడీవో గంగుల గణేశ్‌రెడ్డి అన్నారు. ఆదివా రం ఎంపీడీవో కార్యాలయ సూపరింటెండెంట్ నారాయణ పదవీ విరమణ పొందారు. ఈ సందర్భంగా ప్రజా ప్రతి నిధులు, అధికారు లు నారాయణ దంపతులను సన్మానించారు.

గుండెపోటుతో హెడ్ కానిస్టేబుల్ మృతి

సిద్దిపేట అర్బన్, జూన్ 30 : గుండెపోటుతో ఓ హెడ్ కానిస్టేబుల్ మృతి చెందిన ఘటన సిద్దిపేట త్రీ టౌన్ పోలీస్ స్టేషన్‌లో జరిగింది. పోలీసులు తెలిపిన వివరాలు.. త్రీటౌన్ పోలీస్ స్టేషన్‌లో విధులు నిర్వహిస్తున్న 1993 బ్యాచ్‌కు చెందిన హెడ్ కానిస్టేబుల్ కూచన్‌పల్లి యాదగిరి(52)కి శనివారం అర్ధరాత్రి గుండె నొప్పి రావడంతో సీఐ విద్యాసాగర్, ఇతర సిబ్బంది హుటాహుటిన సిద్దిపేట ప్రభుత్వ దవాఖానకు తరలించగా.. అప్పటికే మృతి చెందినట్లు వైద్యులు తెలిపారు. యాదగిరి మృతి పట్ల సీపీ అనురాధ సంతాపం వ్యక్తం చేసి యాదగిరి కుటుంబాన్ని పరామర్శించారు. పోలీసులు యాదగిరి కుటుంబానికి ప్రభుత్వం తరపున రూ.20 వేల ఆర్థిక సహాయం అందించారు. సీపీ ఆదేశానుసారం మండల పరిధిలోని పొన్నాల గ్రామంలో ఆదివార